- **అనుష్కపై దృష్టి.. పంటకు తగలదు దిష్టి**



గద్వాలలో ఓ రైతు ఆయిల్‌పామ్ తోటను సాగు చేశారు. అందులో అంతర పంటగా మిర్చి వేయగా ఏపుగా పెరిగింది. పంటకు దిష్టి తగలకుండా ఉండేందుకు ఆ రైతు ప్రముఖ సినీ హీరోయిన్ అనుష్క చిత్రంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

# గుబ్బ రోగం.. మిర్చి రైతు ఆగం

మొదటిపేజీ తరువాయి...

మొక్క ఎదుగుదల ఆగిపోతున్నది. పూత, పిందెలు నేల రాలిపోతున్నాయి. రైతులు మందులు పిచికారి చేసిన ఒకటి రెండు రోజులపాటు పురుగులు కనబడకుండా పోతున్నా, తిరిగి మళ్లీ విజృంభిస్తున్నాయి. పెట్టుబడి ఖర్చులు అమాంతం పెరిగి, దిగుబడి భారీగా తగ్గడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఒక ఎకరా మిర్చికి సుమారు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన చోట 10 నుంచి 12 క్వింటాళ్లు కూడా రాకపోవడం రైతులను కలవర పెడుతున్నది. పంట పెట్టుబడి విపరీతంగా పెరిగి అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా లో గత వారం రోజుల్లోనే ఇద్దరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా, మరో మహిళా రైతు ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా మారింది.



క్యాంపు తండాలో పాడైన మిరప పంట చేనులో రోదిస్తున్న వీరన్న తండ్రి లచ్చు

## జగ్గుతండాలో మిర్చి రైతు ఆత్మహత్య

నర్సింహులపేట మండలం జగ్గుతండాకు చెందిన అజ్మీరా శ్రీనుకు మూడెకరాల భూమి ఉన్నది. ఇందులో రెండు ఎకరాల్లో మిర్చి పంట వేశాడు. గుబ్బరోగం సోకి అంతా నాశనమైంది. మిర్చి పంట సాగుకు సుమారు రూ.రెండు లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఒక్క రూపాయి కూడా పంట మీద వచ్చే అవకాశం లేకపోవడంతో చేసిన అప్పు ఎలా తీర్చాలనే మనోవేదనకు గురైన రైతు శ్రీను ఈ నెల 11న తెల్లవారుజామున 4 గంటలకు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని చనిపోయాడు. ఇతనికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. శ్రీను మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.

## మిర్చి తోటలోనే గడ్డిమందు తాగి..

కేసముద్రం మండలం క్యాంపు తండాకు చెందిన రైతు దరావత్ వీరన్న-లలిత దంపతులకు మూడున్నర ఎకరాల భూమి ఉన్నది. ఎకరంలో పత్తి, మరో ఎకరంలో వరి, ఇంకో ఎకరంన్నరలో మిర్చి సాగు చేశారు. పత్తి చేను దున్నడం, విత్తనాలు, ఎరువులు, యూరియా, కూలీలు తదితర పెట్టుబడి కోసం రూ.40వేలు ఖర్చు చేశారు. ఇంత చేసినా రెండు క్వింటాళ్ల పత్తి మాత్రమే వచ్చింది. తరువాత పూత, కాత లేదు. పత్తిచేనుకు గులాబీ పురుగు సోకింది. ఎన్ని రకాల మందులు పిచికారి చేసినా ఫలితం లేదు. ఎకరంలో సన్న రకం వరి వేశారు. 25 క్వింటాళ్ల ధాన్యం రావాల్సి ఉండగా 14 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. వీటిని అమ్మగా రూ.30,842 వచ్చాయి. పెట్టుబడి మాత్రమే తిరిగొచ్చింది. మిగిలిన ఎకరంన్నర భూమిలో మిర్చి సాగు చేశారు. మధ్యమధ్యలో మొక్కలు చనిపోతే నర్సరీ నుంచి కొనుగోలు చేసి మరీ నాటారు. మిర్చి తోటకు గుబ్బరోగం సోకడంతో ఊక మందులు పిచికారి చేశారు. మిర్చిని కాపాడుకునేందుకు రూ.1.90 లక్షలు అప్పు చేశారు. పూత,కాత లేక మిర్చి పంటను తొలగించి మక్కజొన్న వేసేందుకు 20 గుంటల భూమిని ట్రాక్టర్‌తో దున్నించాడు. మిగిలిన ఎకరంలో కూడా మిర్చి పంటను దున్ని మక్కజొన్న వేద్దామని అనుకున్నాడు. అయితే, భార్య లలిత మిర్చి తోట ఉంచాలని కోరింది. మిర్చి పంటను కాపాడే ప్రయత్నంలో ఈ నెల 8న మందు పిచికారి చేస్తున్న వీరన్న మనస్తాపంతో గడ్డిమందు తాగాడు. సమీపంలోనే పనిచేస్తు న్న వీరన్న భార్య లలిత కూడా మందు తాగింది. దీంతో ఇద్దరినీ మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. వీరన్న పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 13న మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్న లలిత పరిస్థితి కూడా అత్యంత విషమంగా ఉన్నదని డాక్టర్లు చెప్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వీరన్న తండ్రి లచ్చు కోరారు.

### మిరప కాతలేదు



రెండున్నర ఎకరాల్లో మిరప సాగు చేసిన. ఇందులో ఎకరం 30 గుంటలు కౌలుకు తీసుకున్నా. గుబ్బరోగం, నల్లి సోకి అర ఎకరం ఎండిపోయింది. కాయలు కాయడం లేదు. మొత్తం రూ.3 లక్షల పెట్టుబడి పెట్టిన. రూ.లక్ష కూడా వచ్చే పరిస్థితి లేదు.

**- లకావత్ బిచ్చు, రైతు, బీల్యాతండా, నర్సింహులపేట**

### రూపాయి రాలేదు



రెండున్నర ఎకరాల్లో మిర్చిసాగు చేశా. వాతావరణం అనుకూలించకపోవడంతో ఎండురోగం, నల్లి, గుబ్బరోగం వచ్చింది. మందులు పిచికారీ చేసినా చేను కోలుకోలేదు. రూ.2 లక్షలు పెట్టిన.

**- భూక్యా భద్రు, రైతు, కల్వల, కేసముద్రం**

### అవగాహన కల్పిస్తున్నాం

రెండేండ్ల నుంచి మిర్చికి గుబ్బ వైరస్ సోకుతున్నది. దిగుబడి బాగా తగ్గింది. గుబ్బ రోగంతోపాటు జెమినీ వైరస్ గురించి కూడా రైతులకు అవగాహన కల్పించాం. తుపాన్‌తో వాతావరణంలో మార్పులొచ్చాయి. దీనితో గుబ్బ వైరస్ విస్తృతమై మిర్చి పంటను నాశనం చేస్తున్నది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

**- సూర్యనారాయణ, ఉద్యాన శాఖ జిల్లా అధికారి, మహబూబాబాద్**

## మావోయిస్టుల దాడిలో సీఆర్‌పీఎఫ్ ఎస్సై మృతి

- **జవాన్‌కు తీవ్రగాయాలు**

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 17 : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఆదివారం మావోయిస్టులు జరిపిన మెరుపుదాడిలో ఓ భద్రతా అధికారి మృతిచెందగా, జవాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జగర్‌గూండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతర్గత ప్రాంతం నుంచి సీఆర్‌పీఎఫ్ 165వ బెటాలియన్ భద్రతా దళాలు ఉర్సుగల్ వైపు సెర్చింగ్ ఆపరేషన్‌కు బయలుదేరాయి. ఈ క్రమంలో భద్రతా దళాలపై మావోయిస్టులు మెరుపుదాడి చేశారు. జవాన్లపై కాల్పుల వర్షం కురిపించడంతో అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు జరిపారు. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు పారిపోయారు. అప్పటికే మావోయిస్టుల దాడిలో గాయపడిన సీఆర్‌పీఎఫ్ ఎస్సై సుధాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. మరో జవాన్ రాము తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఎయిర్‌లిఫ్టర్‌తో రాయ్‌పూర్‌కు తరలించారు. గాలింపు ముమ్మరం చేసిన భద్రతా దళాలు.. నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఎస్సై సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని హెడ్‌క్వార్టర్స్‌కు తరలించారు.

# కిలో చికెన్@240

## కొక్కొరోకో.. కొండెక్కిందహో

- **ఐదు రోజుల్లోనే రేటు డబుల్**
- **కార్తికమాసం ముగింపుతో డిమాండ్**
- **ఆన్‌లైన్‌లోనూ 100కు పైగా పెంపు**

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): హాలిడే వచ్చిందంటే సరదాగా గడిపే నగరవాసుల భోజనంలో చికెన్, మటన్ ముక్కలు ఉండాల్సిందే! అయితే కార్తిక మాసంలో సహజంగానే కోళ్లు, చికెన్ ధరలు తగ్గాయి. ఇప్పుడు కార్తికం ముగియడంతో ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. గురువారం నుంచి ధరలు పెరుగుతున్నాయి. కార్తిక మాసంలో కిలో చికెన్ ధర గరిష్ఠంగా రూ.180 ఉండేది. ఆదివారం ఒక్కసారిగా రూ.220-240కి చేరింది. మొబైల్ యాప్‌లలోనైతే రూ.250-280కి విక్రయిస్తుండటం నివ్వెరపరుస్తున్నది.

### ఒక్కసారిగా పెరిగిన ధర

రిటైల్ మార్కెట్‌లో ధరలు కూడా అధికమయ్యాయి. వారం క్రితం కిలో చికెన్ ధర రూ.150-180గా ఉండేది. ఇలా ఒక్కో కిలోపై రూ.80-90 పెరిగి, ఆదివారం కిలో



రేట్ రూ.220-240కి చేరింది. బాయిలర్ చికెన్‌తోపాటు దేశీకోడి కూడా ఒక్కో కిలో మాంసాన్ని రూ.100-150 ఎక్కువకు విక్రయించారు.

### ఆన్‌లైన్‌లోనూ అధిక రేట్లు

కొంతకాలంగా హైదరాబాద్‌లో ఆన్‌లైన్ వేదికగా మాంసం క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీకెండ్‌లో సరేసరి. కార్తిక మాసంలో ఆఫర్లతో ఆకట్టుకున్న ఈ-కామర్స్ సైట్లు, ఫుడ్ డెలివరీ యాప్‌ల నిర్వాహకులు ఇప్పుడు ఆఫర్ల జోలికి వెళ్లకుండా ఉండటమే కాక ధరలు పెంచేశాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో చికెన్ ధర రూ.200 ఉంటే మొబైల్ యాప్‌లలో క్వాలిటీ పేరిట రూ.250-280 క్రయవిక్రయాలు జరుపుతున్నారు. కార్తిక మాసంలో ఓ మాంసం విక్రయ సంస్థ ఏకంగా 50 శాతం డిస్కౌంట్ సేల్స్ నిర్వహించగా, ఇప్పుడు అదే ప్లాట్‌ఫారంలో డెలివరీ చార్జీలతో కలిపి కిలో చికెన్ రూ.310కి లభిస్తున్నది.

### పెండ్లిళ్లు, పండుగల సీజనూ కారణమే

చికెన్ ధరల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మటన్ కేజీ రూ.800 నుంచి రూ.1000 పలుకుతున్నది. కార్తిక మాసం ముగిసి పెండ్లిళ్ల సీజన్ మొదలయ్యింది. క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి సమీపిస్తుండటంతో చికెన్ ధరలకు అమాంతం రెక్కలొస్తున్నాయి. కోడిగుడ్ల ధరలు కూడా పెరుగుతుండటం గమనార్హం. కోళ్లఫారం నిర్వహణ వ్యయం పెరుగుతుండటంతో హోల్‌సేల్ ధరలూ గణనీయంగా పెరుగుతాయని టాక్. ఈ పరిణామం వచ్చే మూడు నెలలపాటు చికెన్ ధరలను ప్రభావితం చేస్తాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.



దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో పాల్గొన్న క్యాడెట్లు

## సాంకేతికంగా అప్‌డేట్ కావాలి

- **క్యాడెట్లకు ట్రెడిషన్, ఇన్నోవేషన్ అవసరం**
- **రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్**
- **దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్**

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతికతపై క్యాడెట్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. శిక్షణ పూర్తిచేసుకున్న క్యాడెట్లకు ట్రెడిషన్, ఇన్నోవేషన్ అవసరమని, రెండింటి సమ్మేళనంతో సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ నిర్వహించారు. రాజ్‌నాథ్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరేడ్‌లో 213 మంది యువ పైలట్లు సైనిక విన్యాసాలు చేశారు. వీరితోపాటు ఇతర దేశాల సైనికాధికారులు కూడా విన్యాసాల్లో పాల్గొన్నారు. పిలాటస్ పీసీ-7 ట్రైనింగ్ ఎయిర్ క్రాఫ్ట్, సుఖోయ్-30, సారంగ్ హెలికాప్టర్లతో చేపట్టిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శిక్షణ పూర్తి చేసుకున్న క్యాడెట్లకు రాజ్‌నాథ్‌సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎన్నో ఇన్నోవేషన్లు వస్తున్నాయని, వాటిపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కుటుంబానికి, బంధువులకు, స్నేహితులకు, పండుగలకు అన్నింటికీ దూరంగా ఉండి శిక్షణను పూర్తి చేసుకున్నారని, అదే శ్రద్ధతో భవిష్యత్తులోనూ పనిచేయాలని సూచించారు. క్యాడెట్లపై మరింత బాధ్యత పెరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎయిర్‌ఫోర్స్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి పర్యవేక్షించారు.

## లైఫ్‌మిషన్ నోడల్ అధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి

- **బీఈఈ సౌత్ మీడియా సలహాదారుగా బాధ్యతలు**
- **కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో తెలుగు వ్యక్తికి అరుదైన గౌరవం**

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలో ఓ తెలుగు వ్యక్తికి అరుదైన గౌరవం దక్కింది. ఇంధన సామర్థ్య రంగంలో సుదీర్ఘ అనుభమున్న అస్పరి చంద్రశేఖరరెడ్డికి కేంద్ర విద్యుత్తు శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సంస్థ ముఖ్యమైన బాధ్యతలు అప్పగించింది. దక్షిణాది రాష్ట్రాలకు ఆయనను బీఈఈ మీడియా సలహాదారుగా నియమించింది. దీంతోపాటు ప్రధాని మోదీ ఇటీవల ప్రారంభించిన 'లైఫ్ మిషన్'కు నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ మేరకు బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే ఉత్తర్వులు జారీ చేశారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రభుత్వరంగ విద్యుత్తు సంస్థలకు సలహాలు, సూచనలివ్వడం ఆయన విధిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి పని చేస్తూ ఇంధన సామర్థ్య లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాల్సి ఉన్నది. దీంతోపాటు ప్రధాని మోదీ ఇటీవల ప్రారంభించిన 'లైఫ్ మిషన్'కు నోడల్ అధికారిగానూ ఆయన బాధ్యతలు నిర్వర్తించనున్నారు. దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇంధన సామర్థ్యం, సంరక్షణకు అవసరమైన చర్యలు




బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారుగా నియామక పత్రం అందుకుంటున్న అస్పరి చంద్రశేఖర్‌రెడ్డి

తీసుకుంటారు. అలాగే ఇంధన సంరక్షణ, పొదుపుకు సంబంధించి బీఈఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలని డీజీ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. చంద్రశేఖరరెడ్డి మూడు దశాబ్దాల వృత్తిపర జీవితంలో చిత్తశుద్ధికి, అంకిత భావానికి దక్కిన గుర్తింపుగా ఇంధనరంగ అధికారులు అభివర్ణిస్తున్నారు.

### జర్నలిస్టుగా మొదలైన జీవితం

అస్పరి చంద్రశేఖర్‌రెడ్డి స్వస్థలం ఏపీలోని కర్నూలు జిల్లా పెద్దపుదిళ్ల గ్రామం. 1988లో జర్నలిజంలో కెరీర్‌ను ప్రారంభించారు. వివిధ పత్రికల్లో వివిధ హోదాల్లో 1992 వరకు విధులు నిర్వర్తించారు. 1992 నుంచి 1994 వరకు అప్పటి సీఎం కోట్ల విజయభాస్కరరెడ్డి ప్రత్యేక పీఆర్వోగా, 2005లో సీఎం వైఎస్సార్‌కు సీపీఆర్వోగా, 2006 నుంచి 2011 వరకు సీఎం ప్రెస్ సెక్రటరీగా పనిచేశారు. తర్వాత ఏపీ ఇంధన సంరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సీఈవోగా బాధ్యతలు చేపట్టి, ఇంధన సంరక్షణలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలపడంలో కీలక పాత్ర పోషించారు. ఇటీవలే ఆయన పదవీ విరమణ చేశారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్' (ఈఈఎస్ఎల్) కొన్నినెలల క్రితం దక్షిణ భారతదేశం, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వ్యాపారాభివృద్ధి, ప్రభుత్వ వ్యవహారాల సీనియర్ సలహాదారుగా నియమించింది. ఈ క్రమంలోనే మరో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బీఈఈ దక్షిణాది మీడియా సలహాదారుగా ఆయనకు అవకాశాన్ని కల్పించింది. దేశవ్యాప్తంగా అనేక మంది ఇంధనరంగ నిపుణులు ఈ పదవికి పోటీపడినా చివరికి చంద్రశేఖరరెడ్డినే అదివరించడం విశేషం.

## ఇక డ్రగ్ టెస్టింగ్ కిట్స్

- **గ్రేహౌండ్స్, ఆక్టోపస్ తరహాలో టీన్యాబ్**
- **విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు**
- **డ్రగ్ రహిత రాష్ట్రంగా తెలంగాణ**
- **టీన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య**

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): మద్యం తాగి వాహనాలను నడిపేవారిని పట్టుకునేందుకు నిర్వహించే డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులు బ్రీత్ అనలైజర్లను వాడుతుంటారు. వీటిని నోట్లో పెట్టి గాలి ఊదగానే అతడు మద్యం తాగిందీ, లేనిదీ.. తాగితే ఎంత మోతాదులో తాగిందీ తెలిసిపోతుంది. ఇప్పుడిదే తరహాలో డ్రగ్ టెస్టింగ్ కిట్స్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నట్టు తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీన్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్ నిర్మూలనకు తీసుకోబోయే చర్యలను వివరిస్తూ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ తెలంగాణగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, అందుకు కావాల్సిన వనరులను ప్రభుత్వం సమకూరుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు చెప్పారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ తరహాలో టీనాబ్‌కు ఓ ప్రత్యేకత ఉండాలని సీఎం చెప్పినట్టు తెలిపారు. విద్యాసంస్థలు, సినిమా, ఐటీ రంగం, బార్, పబ్, రిసార్ట్‌లలో డ్రగ్స్ వినియోగం ఎక్కువగా ఉందని, వాటిపై దృష్టిసారిస్తున్నామని వివరించారు.

### విద్యాసంస్థల్లో కమిటీలు

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలలో యాంటీ డ్రగ్ కమిటీలు(ఏడీసీఎస్) ఏర్పాటు చేసి ఫ్యాకల్టీ, పేరెంట్స్, స్టూడెంట్, నాన్ టీచింగ్ స్టాఫ్, ఎన్జీవో, కౌన్సిలర్, డీఅడిక్షన్ నిపుణులు, హాస్టల్ వార్డెన్, పోలీసులతోపాటు జిల్లా పరిపాలన యంత్రాంగం అందులో సభ్యులుగా ఉండేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ కమిటీలు ఎక్కడైనా డ్రగ్స్ వాడినట్టు గుర్తిస్తే స్థానిక పోలీసులకు, హెల్ప్‌లైన్ నంబర్ 87126 71111, ఈమెయిల్: tsnab-hyd@tspolice.gov.in ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. అథ్లెట్లకు నిర్వహించే డ్రగ్స్ టెస్టులానే టెస్టింగ్ కిట్స్‌ను అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

### దొరికితే డీఅడిక్షన్ సెంటర్‌కే

డ్రగ్స్ తీసుకున్నవారు అరెస్టుల నుంచి తప్పించుకోలేరని సందీప్ శాండిల్య హెచ్చరించారు. దొరికినవారు డీఅడిక్షన్ క్యాంపుల్లో చేరాల్సిందేనని చెప్పారు. బ్రీత్ అనలైజర్స్ పరీక్ష మాదిరిగానే డ్రగ్ పరీక్షలు నిర్వహిస్తామని, ఇందుకోసం పోర్టబుల్ డ్రగ్ డిటెక్షన్ కిట్స్ కొనుగోలుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. లాలాజలంతో చేసే డ్రగ్ టెస్ట్ అతి తక్కువ మోతాదును కూడా గుర్తిస్తుందని తెలిపారు. డ్రగ్స్‌పై సమాచారం ఇస్తే రివార్డు ఇస్తామని పేర్కొన్నారు. కొరియర్ కంపెనీలు, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు, కార్ రెంటల్ కంపెనీలు, సెల్ఫ్‌డ్రైవ్ కార్లతోపాటు సోషల్ మీడియాపై పటిష్ఠ నిఘా ఉంటుందని చెప్పారు. డ్రగ్ కంట్రోల్ అండ్ ఎక్సైజ్ విభాగం, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఆరోగ్య శాఖ, ఎన్జీవోలతో సమన్వయం చేసుకుంటూ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని సందీప్ శాండిల్య వివరించారు.

## నా మిల్లుల్లో అక్రమాలకు తావులేదు

- **కుట్రతోనే నాపై దుష్ప్రచారం**
- **కొన్ని టీవీ చానళ్లు, పత్రికల్లో అసత్య కథనాలు**
- **'నమస్తే తెలంగాణ'తో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్**

బోధన్, డిసెంబర్ 17: రాజకీయంగా తనపై కక్ష సాధించేందుకు నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం తగ్గెల్లిలోని తన రైస్‌మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యానికి సంబంధించి అక్రమాలు జరిగినట్టు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ విమర్శించారు. కుట్రపూరితంగా కొన్ని టీవీ చానళ్లు, పత్రికల్లో (నమస్తే తెలంగాణ కాదు) సీఎంఆర్ కింద ప్రభుత్వం కేటాయించిన ధాన్యం లెక్కల్లో అక్రమాలు జరిగాయంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. తగ్గెల్లిలోని తన రైస్‌మిల్లుల్లో ఎటువంటి అక్రమాలు జరగలేదని, ఈ విషయమై గతంలో కొందరు ఆరోపణలు చేయగా పౌరసరఫరాల శాఖ క్లీన్‌చిట్ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. వాస్తవానికి తన రెండు రైస్‌మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ ధాన్యం తీసుకోలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం తన రైస్‌మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ ధాన్యం కేటాయించలేదని, కిలో బియ్యం కూడా దుర్వినియోగం కాలేదని షకీల్ వివరించారు. ఒకవేళ తన రైస్‌మిల్లుల్లో ఏదైనా అక్రమాలు జరిగినట్లయితే పౌరసరఫరాల శాఖ అధికారులు నోటీసులివ్వాలి కదా? అని ప్రశ్నించారు. ఎలాంటి తప్పు జరగనందువల్లే తనకు నోటీసులు రాలేదని షకీల్ చెప్పారు. గతంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారులు తన రైస్‌మిల్లుల్లో విచారణ జరిపి తనకు క్లీన్‌చిట్ ఇచ్చారని, జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ కూడా తనవద్ద ఉన్నాయని తెలిపారు. తన దగ్గర ఒక గింజ సీఎంఆర్ ధాన్యం లేదని అధికారులు 'నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్' ఇచ్చారని షకీల్ స్పష్టం చేశారు.

### పరువు నష్టం దావా వేస్తా

తన రైస్‌మిల్లులకు సంబంధించి తప్పుడు ప్రచారం చేసిన టీవీ చానళ్లు, పత్రికలపై పరువునష్టం దావా వేస్తానని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ హెచ్చరించారు. సోమవారం పరువు నష్టం దావా నోటీసులను పంపుతామని చెప్పారు.

## ముగ్గురు అయ్యప్ప భక్తుల దుర్మరణం

- **శబరిమలకు వెళ్లి వస్తుండగా తమిళనాడులో ప్రమాదం**
- **మృతులు ములుగు జిల్లా కమలాపురం వాసులు**



సుబ్బయ్యనాయుడు, సాంబయ్య, వెంకటరాజు (ఫైల్)

మంగపేట, డిసెంబర్ 17: శబరిమల అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకొని ఇంటికి తిరిగి వస్తుండగా తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ములుగు జిల్లాకు చెందిన ముగ్గురు అయ్యప్ప భక్తులు దుర్మరణం చెందారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన తలారి సుబ్బయ్య నాయుడు (49), నర్రా సాంబశివరావు (51), నిమ్మల వెంకటరాజు (60), జరుపుల రాము, కూనూరు అజయ్ అయ్యప్ప మాల ధరించి 41 రోజులపాటు దీక్ష పూర్తి చేసుకున్నారు. ఈ నెల14న ఏటూరునాగారానికి చెందిన ఓ అద్దె కారులో శబరిమల వెళ్లారు. దర్శనం చేసుకొని ఆదివారం బయలు దేరారు. మధ్యాహ్నం తమిళనాడులోని తెని జిల్లా పెరియాకుళం మండలం దేవనపట్టి బైపాస్ రోడ్డు మీదుగా వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న వాల్‌ను ఢీకొట్టడంతో అందులో ఉన్న సుబ్బయ్యనాయుడు, సాంబశివరావు, వెంకటరాజుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కూనూరు అజయ్, జరుపుల రాముకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు అక్కడే ఓ దవాఖానలో చేర్పించారు. ఈ ఘటనతో కమలాపురంలో తీవ్ర విషాదం అలుముకున్నది. పంచనామా ప్రక్రియ పూర్తి చేయించి మృతదేహాలను తీసుకొచ్చేందుకు బంధువులు తమిళనాడు వెళ్లారు.

## వేడి రాగిజావలో పడి బాలిక మృతి

- **పాఠశాలలో అల్పాహారం వడ్డిస్తుండగా ప్రమాదం**
- **నిర్మల్ జిల్లా మామడ మండలం కొరిటికల్‌లో విషాదం**
- **ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ సస్పెన్షన్**

మామడ, డిసెంబర్ 17: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉదయం అల్పాహారం కోసం క్యూలో నిల్చున్న ఓ బాలిక.. ప్రమాదావశాత్తు వేడి వేడి రాగిజావలో పడి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన శనివారం నిర్మల్ జిల్లా మామడ మండలం కొరిటికల్‌లో చోటుచేసుకున్నది. కొరటికల్‌కు చెందిన కొండ్ర అశోక్-శిరీషల కూతురు కొండ్ర ప్రజ్ఞ(6) స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నది. రోజు మాదిరిగానే శనివారం పాఠశాలకు వెళ్లింది. ఉదయం 11:30 గంటలకు విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు రాగిజావ వడ్డించడానికి మధ్యాహ్న భోజన నిర్వాహకులు ముత్తవ్వ, లావణ్య, రాజమణి, లక్ష్మీలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో వేడి చేసిన రాగిజావను పెద్ద పాత్ర నుంచి బకెట్‌లోకి వేరు చేస్తున్నారు. ఇంతలో లైన్‌లో నిల్చున్న ప్రజ్ఞ.. ప్రమాదవశాత్తు వేడి రాగిజావ పాత్రలో పడిపోయింది. బాలిక తల, చేతులు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. బాలికను చికిత్స కోసం ఉపాధ్యాయులు సుధాకర్, శ్రీనివాస్, పద్మ, కుటుంబ సభ్యులు నిజామాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి 10 గంటలకు మృతిచెందింది. ఈ ఘటనపై తహసీల్దార్ సర్ఫరాజ్ విచారణ చేపట్టగా.. అల్పాహారం అందించే సమయంలో విద్యార్థులు వరుసలో ఉండేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోలేదని తేలింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు.. డీఈవో రవీందర్‌రెడ్డి.. పాఠశాల ఇన్‌చార్జి ప్రాధనోపాధ్యాయురాలు రమను సస్పెండ్ చేయడంతోపాటు ముగ్గురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగించారు. మృతురాలి తల్లి కొండ్ర శిరీష ఈ గ్రామానికి ఉపసర్పంచ్‌గా ఉన్నారు. చిన్నారి మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## గురుకుల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులు

**జనవరి 6 తుది గడువు.. ఫిబ్రవరి11న ప్రవేశ పరీక్ష**

హైదరాబాద్, డిసెంబర్17 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో 2024 విద్యా సంవత్సరంలో ఐదోతరగతి ప్రవేశాలకు సోమవారం నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ సెక్రటరీ, వీటీజీ సెట్ కన్వీనర్ నవీన్ నికోలస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలు గో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు జనవరి 6లోగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను సమర్పించాలని, ఫిబ్రవరి11న రాతపరీక్ష నిర్వహించి, మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 1800 425 45678 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.